క్లుప్తంగా

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛంఅందజేస్తున్న క్రీడాకారాణి

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన 37వ తైక్వాండో రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ పోటీలకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ 13 ఉమ్మడి జిల్లాల నుంచి 350మంది క్రీడాకారుల ప్రదర్శన ఆకట్టుకుందన్నారు. అనంతరం ప్రతిభ చాటిన వారికి బహుమతులను అందజేశారు. తైక్వాండో స్టేట్ సెక్రటరీ చంద్రమౌళి, ట్రెజరర్ బిలాల్, మాస్టర్ గౌస్ పాల్గొన్నారు.

జాతీయ చిత్రకళ ప్రదర్శన పోటీల్లో చిన్నారుల ప్రతిభ



పురస్కారాలు సాధించిన విద్యార్థులతో కోటేష్

నంద్యాల(అర్బన్): నెల్లూరులోని అమీర్ ఆర్ట్ అకాడమీ నిర్వహించిన జాతీయ చిత్రకళ నికేతన్ పోటీల్లో నంద్యాలకు చెందిన కోటేష్ ఆర్ట్ అకాడమీ చిన్నారులు ప్రతిభ చూపి పతకాలు సాధించారని అకాడమీ నిర్వహకులు చింతలపల్లె కోటేష్ ఆదివారం తెలిపారు. ఈ నెల 7న నిర్వహించిన పోటీల్లో చిన్నారులు వేసిన చిత్రాలు పోటీలకు పంపగా ఆరుగురికి బంగారు పతకాలు, 10మందికి మెరిట్ అవార్డ్స్ వచ్చాయన్నారు. బంగారు పతకాలు సాధించిన వారిలో శ్రేష్ఠ, మృదుల, నాగనిరూపా, ఆశ్లేషా, సాహిత్, జ్ఞానేశ్వర్‌రెడ్డి ఉన్నారని చెప్పారు. అలాగే తనకు నిర్వాహకులు కళా అచార్య పురస్కారం అందజేశారన్నారు.

న్యాయవాదుల క్రీడా పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న బార్ అసోసియేషన్ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని బార్ అసోసియేషన్ న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని క్రీడా పోటీలను ఉపాధ్యక్షుడు బొల్లెద్దుల రవీంద్ర, స్పోర్ట్స్ సెక్రటరీ ప్రసాదరెడ్డి ఆదివారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ న్యాయవాదులు ఒత్తిడికి లోనుకాకుండా ఇటువంటి క్రీడాపోటీల్లో పాల్గొంటే మానసిక ఆనందాన్ని పొందవచ్చన్నారు. క్రికెట్, షటిల్, క్యారంబోర్డు, దివ్యాంగులు, మహిళా న్యాయవాదులకు పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి ఈనెల 26వ తేదీన జడ్జీల చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు.

సీసీఎస్ సీఐగా మంజునాథరెడ్డి



ఎస్పీని కలిసిన సీఐ

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా సీసీఎస్ సీఐగా మంజునాథరెడ్డి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ జమ్ములమడుగు రూరల్ సీఐగా విధులు నిర్వహిస్తున్న తనను ఉన్నతాధికారులు నంద్యాలకు బదిలీ చేశారని చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విధులపట్ల బాధ్యతగా వ్యవహరిస్తానని పేర్కొన్నారు.

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. పలువురు గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండివంటలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి.

ఎస్టీ పునరుద్ధరణకు బిల్లుకు మద్దతివ్వండి

నంద్యాల(అర్బన్): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే పునరుద్ధరణ బిల్లుకు బీజేపీ ప్రభుత్వం మద్దతు ఇచ్చేలా చూడాలని ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బోయపులికొండన్న కోరారు. ఆదివారం నంద్యాల పర్యాటనకు వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి వాల్మీకి సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు.

బ్రెయిలీ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

నంద్యాల(అర్బన్): లూయిస్ బ్రెయిలీ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని అంధులు ఉన్నత లక్ష్యాలు సాధించాలని రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. జాతీయ అంధుల సమాఖ్య, నంద్యాల జిల్లాశాఖ ఆధ్వర్యంలో స్థానిక వివేకానంద ఆడిటోరియంలో ఆదివారం లూయిస్ బ్రెయిలీ జన్మదిన వారోత్సవాలను నిర్వహించారు. ఎన్ఎఫ్‌బీ నంద్యాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, మహేశ్వరరెడ్డి, కార్యవర్గ సభ్యులు మనోహర్, దివాకర్ పాల్గొన్నారు.

కాసులు కురిపిస్తున్న పొగాకు

- అనుకూలించిన వాతావరణం
- నాణ్యమైన ఆకులు లభిస్తున్న వైనం
- క్వింటా ఆకుల ధర రూ.19వేలు
- లాభాలు గడిస్తున్న రైతులు
- మండలంలో 200 ఎకరాల్లో పంట సాగు

ఈ ఏడాది రైతన్నకు వాతావరణం అనుకూలించడంతో పంటలు ఆశించిన దానికన్నా అధికంగా దిగుబడినివ్వడం, ఇంతకుముందెన్నడూ లేనంత ధర లభిస్తుండటంతో లాభాలు చవిచూశారు. ఇప్పటి వరకు వరి, మొక్కజొన్న, మినుము, జొన్న తదితర పంటలు అన్నదాతకు మిగులు చూపగా ఇప్పుడు పొగాకు వంతు వచ్చింది. ఆకులు ఏపుగా రావడంతో దిగుబడి, ధర బాగుండటంతో సాగుదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రుద్రవరం: పొగాకు.. ఆ పేరు వినగానే ప్రాణానికి హానికరమైనదంటారు. పొగాకుతో తయారయ్యే బీడీ, సిగరెట్టు, తంబాకు వంటివి వాడటం వల్ల ఆరోగ్యాలు దెబ్బతింటాయని భావిస్తుంటారు. అయితే అంతటి హానికరమైన పొగాకు పంటను సాగు చేసి కొందరు రైతు మంచి లాభాలు గడిస్తున్నారు. ఏదైనా పంట సాగు చేస్తే నేల అంతర్భాగం లోనుంచి లేదా పంటపై భాగాన కంకి రూపంలో దిగుబడులు వస్తాయి. అయితే పొగాకు పంటలో మాత్రం కేవలం ఆకులే దిగుబడులుగా వచ్చి రైతులకు కాసులు కురిపిస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో పొగాకు ఆకులు క్వింటా రూ.19వేల వరకు ధర పలుకుతుండటంతో రైతులు ఆశ్చర్యానికి గురవతున్నారు. మండల పరిధిలోని ముత్తలూరు, నర్సాపురం,ఆలమూరు, డీ.కొట్టాల, శ్రీరంగాపురం, రుద్రవరం, మందలూరు, నల్లవాగుపల్లె, తిప్పారెడ్డిపల్లె తదితర గ్రామాల పరిధిలోని రైతులు దాదాపు 2వందల ఎకారల్లో ఈ పంట సాగు చేశారు. వాతావరణం అనుకూలించడంతో పంట ఏపుగా పెరిగింది. నాణ్యమైన ఆకులు పెరగడంతో వాటిని కోయించి తోరణాలుగా కట్టి పందిళ్లుగా మార్చి ఆరబెడుతున్నారు. కాస్త ఎండగానే వాటిని చుట్టలు (బేళ్ల)గా చుట్టి ఎగుమతి చేస్తున్నారు.



డి.కొట్టాల వద్ద సాగు చేసిన పొగాకు పంట



ప్రత్యేక పందిరిలో ఆరబెట్టిన పొగాకు తోరణాలు



చుట్టలుగా ప్యాకింగ్ చేస్తున్న దృశ్యం


శ్రమకు తగ్గ ఫలితం



నేను మూడెకరాల్లో పంట సాగు చేశా. పొగాకు పంట సాగులో శ్రమకు తగ్గ ఫలితం దక్కింది. ఎకరా పొలంలో ఈ పంట సాగు చేసేందుకు దాదాపు రూ.70వేల వరకు ఖర్చు అవుతుంది. ఈ ఏడాది పంట ఏపుగా పెరగడంతో ఎకరాకు 13 నుంచి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. దిగుబడికి తగ్గట్టుగానే ధర మంచిగా పలుకుతోంది. కోతలు కోయించి ఆకులను పందిళ్లుగా కట్టి ఆరబెట్టి ఎండిన తరువాత చుట్టలుగా ప్యాక్ చేసి దీబగుంట్ల వద్దకు తీసుకెళ్తే అక్కడి నుంచి వ్యాపారులు వివిధ ప్రాంతాలకు తరలిస్తారు. తాము అక్కడికి తీసుకెళ్లినందుకు అయిన ఖర్చులు కూడా వ్యాపారులే భరిస్తున్నారు.ఈ ఏడాది పొగాకు పంట తమకు కాసులు కురిపిస్తోంది.

– నరసింహారెడ్డి, రైతు, డీ.కొట్టాల

జిల్లేడు ఆకుపై రామయ్య చిత్రం



నంద్యాల (వ్యవసాయం): శ్రీరామ జన్మభూమి అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భాన్ని పురస్కరించుకొని పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు ప్రభుత్వ ఉపాధ్యాయుడు తుర్లపాటి సుబ్రహ్మణ్యం ఆర్క(జిల్లేడు) పత్రంపై అయోధ్య రామయ్య వర్ణచిత్రం ఆకట్టుకుంటుంది. ఆయన మాట్లాడుతూ ఆర్క అంటే జిల్లెడు, సూర్యుడు అని అర్థాలు ఉన్నాయి. శ్రీరాముడు సూర్యవంశ రాజు అయినందున సూర్యుడికి ప్రీతికరమైన జిల్లేడు ఆకుపై శ్రీరాముల వారిని రామమందిరాన్ని చిత్రీకరించినట్లు చెప్పారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటిపూట ఉచిత విద్యుత్ సరఫరా అందిస్తున్నట్లు ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి వారం పాటు సుద్దమల్ల, మాయలూరు ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు.. ఇంజేడు, కొండుపల్లె, హరివరం, ఎస్.కొత్తపల్లె, అక్కంపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 3 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని చెప్పారు.

భక్తి శ్రద్ధలతో నగర సంకీర్తన



సీతారామ లక్ష్మణ వేషధారణలో నగర సంకీర్తనలో పాల్గొన్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో శ్రీబాలాజీ కాంప్లెక్స్ కొశెట్టి సుబ్బమ్మ కల్యాణ మండపం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం మహిళలతో అయోధ్యలో బలరాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా నగర సంకీర్తన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సీతారామ,లక్ష్మణ,ఆంజనేయస్వామి వేషధారణతో సంకీర్తనలతో పట్టణ వీధుల్లో ఊరేగింపు చేపట్టారు. అనంతరం అయోధ్య కర సేవకులను ఘనంగా సత్కరించారు. అలాగే 500సంవత్సరాల పోరాట ఘట్టాల గురించి జాగృతి ప్రత్యేక సంచికను జగదానందకర పుస్తకాన్ని అందరికీ అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ నెట్ల మహేశ్వరరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, కొశెట్టి కృష్ణమూర్తి, రాంప్రసాద్, సందీప్, చంద్రశేఖర్, సురేష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



నంద్యాల(న్యూటౌన్): స్థానిక ఇండోర్ స్టేడియంలో రెండో రోజు ఆదివారం రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు కొనసాగాయి . మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 10 గంటల వరకు పోటీలు జరుగుతాయని, ఉమ్మడి జిల్లాల కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ ఏపీ రెడ్డి, ఉపాధ్యక్షుడు నాగరాజు, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజు తెలిపారు. పోటీల్లో చిత్తూరు, గుంటూరు జట్లు తలపడగా గుంటూరు గెలిచిందన్నారు. అలాగే వెస్ట్ గోదావరిపై ఈస్ట్ గోదావరి విజయం సాధించిందని చెప్పారు. ఈనెల 22వ తేదీ వరకు పోటీలు జరుగుతాయని, చివరి రోజున విజేత జట్లకు బహుమతులు అందజేస్తామన్నారు. క్రీడాకారులు గురురాజ విద్యాసంస్థల యాజమాన్యం భోజన వసతి ఏర్పాటు చేసింది.

హోరాహోరీగా అర్బన్ లెవల్ క్రికెట్ పోటీలు



జ్ఞానాపురం జట్టును అభినందిస్తున్న 3టౌన్ సీఐ, అధికారులు



ఉయ్యాలవాడ జట్టుకు క్రికెట్ కిట్లు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(సిటీ): నంద్యాల పట్టణంలోని నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర అర్బన్ లెవల్ క్రికెట్ ఫైనల్ పోటీలో జ్ఞానాపురం జట్టు విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన వీసీ కాలనీ జట్టు మొదట బ్యాటింగ్‌కు దిగి 10 ఓవర్లలో 72 పరుగులు చేయగా.. 33వ వార్డు జ్ఞానాపురం (చర్చ్ కాంపౌండ్) జట్టు నిర్ణీత 10 ఓవర్లకు 73 పరుగులు చేసి విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో చివరి బంతికి ఆరు పరుగులు చేయాల్సి ఉండగా జ్ఞానాపురం బ్యాట్స్‌మెన్ రంజిత్ చివరి బంతికి సిక్స్ కొట్టి ఉత్కంఠకు తెరదించారు. అనంతరం గెలుపొందిన జట్టును 3టౌన్ సీఐ నరసింహులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కారు రవికుమార్, అధికారులు, సచివాలయ సిబ్బంది అభినందించారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

ఉయ్యాలవాడ : క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించాలని ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ అన్నారు. క్రికెట్‌లో విజయం సాధించి నియోజకవర్గ స్థాయికి ఎంపికైన ఉయ్యాలవాడ క్రికెట్ జట్టు కెప్టెన్ షాహిద్, క్రీడాకారులను ఎంపీడీఓ ఉమామహేశ్వరరావుతో కలిసి అభినందించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్ర క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ నెల 18న ప్రారంభమైన మండలస్థాయి క్రికెట్ పోటీల్లో 11 గ్రామ సచివాలయాల పరధిలోని ప్రతిభ కనబరచిన జట్లు తలపడ్డాయి. ఉదయం సెమీ ఫైనల్‌లో ఆర్.జంబులదిన్నె జట్టుతో తలపడి ఉయ్యాలవాడ జట్టు విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. ఫైనల్‌లో తుడుమలదిన్నె, ఉయ్యాలవాడ జట్లు తలపడగా మొదటిగా బ్యాంటిగ్ చేసిన తుడుమలదిన్నె జట్టు 10 ఓవర్లలో 49 పరుగులు చేశారు. 50 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన ఉయ్యాలవాడ జట్టు కేవలం 8 ఓవర్లలో 50 పరుగులు సాధించి విజయం సాధించింది. వ్యాయామ ఉపాధ్యాయులు నరసింహులు, బుచ్చిబాబు ఉన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవం



అమ్మవారికి హారతిస్తున్న దృశ్యం

రుద్రవరం: మండలంలోని నల్లవాగుపల్లెలో గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠో త్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన కొందరు గంగమ్మకు నూతన ఆలయం నిర్మించారు. మూడు రోజల నుంచి వేద పండితులు వివిధ రకాల పూజా కార్యక్రమాలు చేపట్టి ఆదివారం వేద మంత్రోచ్చారణల నడుమ ఆలయ,అమ్మవారి విగ్రహ, ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు జరిపించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని అమ్మవారికి నివేదించారు. ప్రతిష్ఠోత్సవాన్ని తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

సమాజహిత కార్యక్రమాలు చేపట్టండి



మాట్లాడుతున్న కందగట్ల స్వామి

నంద్యాల(వ్యవసాయం): ఇంజినీర్లు సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలని, ఆర్థిక స్థోమత లేని విద్యార్థులను ఆదుకోవాలని అఖిల భారత పద్మశాలీ సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి తెలిపారు. స్థానిక భద్రావతి భావనారుషి కల్యాణ మండపంలో రాయలసీమ పద్మశాలీ ఇంజినీర్ విభాగ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీమ జిల్లాల ఇంజినీరింగ్ విభాగ అధ్యక్ష, కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకారం నిర్వహించారు. సంఘం ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ భీమునిపల్లి వెంకటసుబ్బయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. అధ్యక్షుడు పుట్టా పాండురంగయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ వేణుమాదవ్, కోశాధికారి చంద్రమౌళి, లక్ష్మీనారాయణ, నరసింహులు, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ఈరోజు

స్పందన..

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రవికుమార్ ఆదివారం తెలిపారు. గ్రామ సచివాలయాల్లో ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తారని.. అక్కడ సమస్యలకు పరిష్కారం లభించకపోతే మండల స్థాయిలో జరిగే కార్యక్రమంలో సంప్రదించాలని సూచించారు.

పెద్దయమ్మనూరుకు ఎంపీ, ఎమ్మెల్యే రాక

మండలంలోని పెద్దయమ్మనూరు గ్రామానికి నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సోమవారం రానున్నారని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పెద్దయమ్మనూరు సచివాలయంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తారని వెల్లడించారు. మండల స్థాయి అధికారులు మధ్యాహ్నం 3 గంటలకు గ్రామానికి చేరుకోవాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

గోస్పాడు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి డాక్టర్ సరోజినిదేవి సూచించారు. మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. అందులో భాగంగా ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమం కార్యక్రమం చేపట్టారు. అధ్యాపకులు సంతోష్‌కుమార్‌నాయక్, ఫరీదా, లోకేష్, వంశీకృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటు

నంద్యాల(అర్బన్): పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీ ప్రధాన వీధిలో విద్యుత్ స్తంభం దూరంగా ఉండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. తీగలు వేలాడుతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. సమస్యను ఆదివారం ఉదయం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. డీ2 ఏఈ రామయ్య ఆధ్వర్యంలో సిబ్బంది సాయంత్రం విద్యుత్ స్తంభంతో పాటు తీగలను ఏర్పాటు చేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యేకు కాలనీ వాసులు ప్రమోద్, మురళీ, సుబ్బమ్మ, లక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

మినహాయింపు ఇవ్వాలి

నంద్యాల(న్యూటౌన్): రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల విధుల్లో గర్భిణులు, చంటి పిల్లల తల్లులకు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి, 55 సంవత్సరాలు దాటిన ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలని పీఆర్‌టీయూ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణారావు, అధ్యక్షుడు భాస్కరరెడ్డి కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. విజయరావు, హనుమంతు, కలీముల్లా, మౌళిరెడ్డి, నర్సయ్య పాల్గొన్నారు.

98 క్వాలిఫైడ్‌లందరికీ ఉద్యోగాలు ఇవ్వాలి

నంద్యాల(అర్బన్): 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని 98 రిమైనింగ్ క్వాలిఫైడ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. స్థానిక నిశాంత్ భవన్‌లో ఆదివారం 98 రిమైనింగ్ క్వాలిఫైడ్‌లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిన వారందరికీ ఉద్యోగ అవకాశం కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. 6,700 మంది క్వాలిఫైడ్‌లు ఉండగా రిజర్వేషన్లు పాటించకుండా మెరిట్ ఆధారంగా 4వేల మందికి ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. ప్రభుత్వం స్పందించి అందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. జిల్లా నాయకులు రమణ, రామన్న పాల్గొన్నారు.

లెనిన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): కార్మిక, కర్షక వర్గ విముక్తి పోరాట సిద్ధాంత కర్త లెనిన్‌ను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్ సూచించారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం లెనిన్ శత వర్ధంతి సభను నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు సోమన్న, ధనుంజయుడు, శ్రీనివాసులు, రామకృష్ణ, శివయ్యయాదవ్, నారాయణ, వరదరాజులు, మహిళా సంఘం నాయకురాలు షమీమ్‌బేగం, మాధవి, షబానా పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధి దేశానికే ఆదర్శం



సీసీ రోడ్ల శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి



సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను అందిస్తున్న ఎంపీ పోచా, ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(సిటీ): రాష్ట్రంలో జరగుతున్న సంక్షేమాభివృద్ధి దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక 18వ వార్డులో మాజీ మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్ దేశం సులోచన, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులో రూ.1.85 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ముందుగా వార్డులో ఇంటింటికీ తిరిగి నాలుగున్నరేళ్లలో అందించిన సంక్షేమ ఫలాలను వివరించి కరపత్రాలను అందించారు. ఎంపీ పోచా మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో గతమెన్నడూ లేనంతగా సంక్షేమాభివృద్ధిని అత్యంత పారదర్శకంగా ప్రజలకు అందించిన ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీనే నన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో జగనన్న చొరవతో నంద్యాల రూపురేఖలను మార్చి చూపించామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ పీపీ మధుసూదన్‌రెడ్డి, ఏపీఎస్సీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, నాయకులు నారాయణరెడ్డి, గోవిందరెడ్డి, మోహన్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, నాగేశ్వరరావు, శేఖర్, పట్టణ అధ్యక్షుడు పున్నాశేషయ్య కౌన్సిలర్లు పున్నా రాజేశ్వరి, మురళి, షెహనాజ్, కృష్ణమోహన్, కలాం బాషా, కోఆప్షన్ సభ్యులు శోభారాణి, పడకండ్ల సుబ్రహ్మణ్యం, అంజి, శ్రీరాములు, కిరణ్‌కుమార్, లక్ష్మీనారాయణ, దేవనగర్ బాషా, రహంతుల్లా, దండే సుధాకర్, అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాల లబ్ధి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి

నంద్యాల(సిటీ): అర్హులు పథకాలకు దూరంగా ఉండిపోరాదనే కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం ప్రారంభించిందని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని దేవనగర్, నూనెపల్లెలో అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో కలిసి ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్ వాహనాన్ని పరిశీలించారు. ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన, పోషణ్ అభియాన్, ఉజ్వల 2.0, పీఎం ఆవాస్ యోజన తదితర స్టాళ్లను సందర్శించారు. నవభారత నిర్మాణంలో అమృతకాలం విశిష్టత, వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఔన్నత్యం పై పోస్టర్లను విడుదల చేసిన అనంతరం ప్రధాని మోదీ సందేశాన్ని తిలకించారు. కార్యక్రమంలో రాష్ట్ర దృశ్య కళల డైరెక్టర్ సునీతఅమృతరాజ్, కౌన్సిలర్లు సుబ్బలక్ష్మి, , రాజ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు అనిల్ అమృతరాజ్, పార్థుడు, దేవనగర్ బాషా, మెప్మా సీఎంఎం విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

అపూర్వ కలయిక.. ఆనంద డోలిక



వైపీపీఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఆళ్లగడ్డ: వారంతా ఒకే కళాశాలలో విద్యాభ్యాసం చేశారు. వివిధ రంగాల్లో ఉన్నతోద్యోగులుగా పనిచేసున్నారు. ప్రస్తుతం వేర్వేరు చోట్ల స్థిరపడ్డారు. సుమారు 40 ఏళ్ల తరువాత మళ్లీ తాము చదివిన కళాశల చెంతకు చేరారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. స్థానిక వైపీపీఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1985–87 ఇంటర్ మీడియెట్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం కళాశాల ఆవరణలో కలుసుకున్నారు. కుశలప్రశ్నలతో కాలక్షేపం చేశారు. పాతరోజులను గుర్తుకు తెచ్చుకుని ఉల్లాసంగా గడిపారు. కొందరు కుటుంబ సమేతంగా వచ్చారు. అందరు కలిసి మరోసారి గ్రూప్ ఫొటో దిగారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ గంగన్న, హరిప్రసాద్‌రెడ్డి, డేవిడ్ శేఖర్, భువనేశ్వరి, రామలింగారెడ్డి ఉన్నారు.

డీవీ సుబ్బయ్యకు రోటరీ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న డీవీ సుబ్బయ్య

నంద్యాల(వ్యవసాయం): రోటరీ మాజీ అధ్యక్షుడు డీవీ సుబ్బయ్య ప్రతిష్ఠాత్మక రోటరీ పురస్కారాన్ని ఆదివారం అందుకున్నారు. స్థానిక రోటరీ కార్యాలయంలో రోటరీ ఇంటర్నేషనల్ ప్రతిష్ఠాత్మక పాల్ హ్యారీస్ ఫెలో పురస్కారం అందుకున్న మిడ్‌టౌన్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు సుబ్బయ్యను డీఆర్ఎఫ్‌సీ చైర్మన్ చిన్నపురెడ్డి అభినందించారు. సుబ్బయ్య మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా రోటరీ క్లబ్ ద్వారా వివిధ పదవులు అలంకరించి విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు గాను ఈ గుర్తింపు లభించిందన్నారు. సుబ్రహ్మణ్యం, కేశవమూర్తి, శ్రీనివాసరెడ్డి, మురళీకృష్ణ, కిరణ్‌కుమార్‌రెడ్డి, గాంధీ, శేషఫణి పాల్గొన్నారు.

గుడ్డు ధరలకు రెక్కలు

గోస్పాడు: మార్కెట్‌లో కోడి గుడ్ల ధరలు ఎగబాకుతున్నాయి. నెలరోజుల క్రితం నుంచి రోజురోజుకు పెరుగుతున్నాయి. సాధారణంగా చలి కాలంలో గుడ్ల ధరలు కొంత అధికంగా ఉంటాయి. ఈ సీజన్‌లో అత్యధికంగా వంద గుడ్లు హోల్‌సేల్ మార్కెట్‌లో రూ.625 పలికాయి. నంద్యాలకు చెందిన వ్యాపారులు హైదరాబాద్, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి కోళ్లు,గుడ్లను దిగుమతి చేసుకుంటారు. దీంతో కొంత మేర ధర అధికంగా ఉంటున్నాయి. అంతేగాకుండా చలికాలంలో గుడ్ల వినియోగం అధికంగా ఉంటుంది. అలాగే మనకు అందుబాటులో ఉన్న కోళ్లు, కోడిగుడ్లు పశ్చిమ రాష్ట్రాలకు అధికంగా సరఫరా అవుతుండటంతో ఇక్కడి ప్రాంతాలకు సరఫరా తగ్గిపోయింది. ధరలు అధికంగా ఉన్న సమయంలో సరఫరా తక్కువైతే ధర మరింత పెరుగుతుందని వ్యాపారులు పేర్కొంటున్నారు. కిరాణా దుకాణాల్లో ఒక గుడ్డు రూ.7, రూ.8 ప్రకారం విక్రయిస్తున్నారు.